# ఆయకట్టుకు పునరుజ్జీవం

## రెండు పంటలకు భరోసా

పునరుజ్జీవ పథకం అమలులో మాజీ మంత్రి, ప్రస్తుత బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కృషి ఎంతో ఉంది. రివర్స్‌పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీకి నీరు తీసుకురావచ్చనే ఆయన సూచనతో ఈ పథకానికి రూపకల్పన మొదలై పనులు పూర్తిచేశారు. పునరుజ్జీవ పథకం రైతుల్లో నూతన ఉత్తేజాన్ని నింపింది. ఎస్సారెస్పీ ఆయకట్టుకు రెండు పంటలకు భరోసాను ఇచ్చింది. వరదకాలువ ద్వారా బాల్కొండనియోజక వర్గంలోని చెరువులు నింపుకునేలా వరద కాలువకు తూములను ఏర్పాటు చేయడంతోపాటు చెరువులను నింపారు. వరదకాలువ నిండుకుండలా మారడంతో భూగర్భజలాలు పెరగడంతో సాగు,తాగునీటి కష్టాలు దూరమయ్యాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కాళేశ్వరంపై విషప్రచారాలు మొదలయ్యాయి. వర్షాభావ పరిస్థితులు వస్తే వరదకాలువ ద్వారా ఎస్సారెస్పీకి నీటిని తీసుకువస్తారా అనే అనుమానాలను రైతులు వ్యక్తంచేస్తున్నారు.

కాళేశ్వరం జలాలతో ఎస్సారెస్పీకి జీవకళ
ఏడాది పొడవునా వరద కాలువలో నీళ్లు
తొలగిన సాగు, తాగునీటి కష్టాలు
సాగవుతున్న రెండు పంటలు..
'శ్రీరాంసాగర్'ను
ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకునేనా?
ఆయకట్టు రైతుల్లో అనుమానాలు

### సాగునీరు పుష్కలం

**ఉత్తరతెలంగాణ** వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 112 టీఎంసీల నుంచి 80.5 టీఎంసీలకు పడిపోయింది. దీంతోపాటు దశాబ్దాలుగా ప్రాజెక్ట్‌లో పెరిగిన పూడిక, ఎగువన బాబ్లీ ప్రాజెక్ట్ నిర్మాణం ఎస్సారెస్పీ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్నకు.. పునరుజ్జీవ పథకంతో జీవం పోసినట్లయ్యింది. 102 కిలోమీటర్ల మేర వరద కాలువలో నీరు ఎదురెక్కి ఎస్సారెస్పీని చేరడానికి ఏర్పాటు చేసిన పునరుజ్జీవ పథకం 2023లో మొదటిసారి చేపట్టారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ (వరదకాలువ 73వ కిమీ)వద్ద మొదటి పంపుహౌస్, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, రాజేశ్వర్‌రావుపేట్(వరదకాలువ 34కిమీ) వద్ద రెండో పంపుహౌస్, నిజామాబాద్ జిల్లా ముప్కాల్(0.10కిమీ) వద్ద మూడో పంప్ హౌస్ మీదుగా కాళేశ్వరం జలాలు ఎస్సారెస్పీని ముద్దాడాయి. దీంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డా ఎస్సారెస్పీపై ఆధారపడిన రైతాంగానికి సాగునీటి భరోసా కల్పించినట్లయ్యింది.

*వర్షాభావ పరిస్థితులు, ఎగువ ప్రాంతం నుంచి వరద రాకపోవడంతో ఎడారిలా మారుతున్న ఎస్సారెస్పీకి బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం జలాలతో జీవం పోసింది. ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీరందించి రైతులను ఆదుకున్నది. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే ఆయకట్టును రక్షించుకోవడానికి వందల కిలో మీటర్ల నుంచి కాళేశ్వరం జలాలను ఎదురెక్కించి ఎస్సీరెస్పీ పునరుజ్జీవ పథకంతో వరద కాలువను జీవనదిలా మార్చింది. దీంతో రైతాంగం 'సాగు'పండుగ చేసుకున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వట్టిపోకుండా ఉండేందుకు చేపట్టిన పునరుజ్జీవ పథకం ద్వారా వరద కాలువకు ప్రాణం పోసింది. రెండు పంటలు పండించుకోవడానికి ఢోకా లేదన్న భీమా కాళేశ్వరం జలాలను రివర్స్ పంపింగ్ ద్వారా తెప్పించి రైతుల నీటి కష్టాలను దూరం చేసింది కేసీఆర్ ప్రభుత్వం. పునరుజ్జీవ పథకం ద్వారా ఎస్సారెస్పీని నింపడంతోపాటు 365 రోజులూ వరదకాలువలో నీళ్లు ఉంచాలన్న కేసీఆర్ కల నెరవేరగా.. రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. 2023 జూలైలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో వరదకాలువ ద్వారా రివర్స్‌పంపింగ్‌తో నీటిని రోజుకు ఒక టీఎంసీ చొప్పున ఎస్సారెస్పీలోకి తరలించారు. వరదకాలువలో ఎదురెక్కుతున్న జలాలకు గ్రామగ్రామాన పూలు జల్లుతూ స్వాగతం పలుకుతూ సంబురాలు చేసుకున్నామని రైతులు గుర్తుచేసుకుంటున్నారు.*

*-మోర్తాడ్, జూన్ 20*

### సాగు నీటికి ఢోకా లేదు



వరదకాలువలో నీళ్లుంటే సమీప ప్రాంతాల్లో వ్యవసాయభూముల్లో సాగుకు ఢోకా ఉండదు. భూగర్భ జలాలు, బోర్లలో నీళ్ల పెరగడం, వరదకాలువ నీటితో చెరువులు నింపుకునే అవకాశం ఉండడంతో నీటి కష్టాలు దూరమైనయ్. వరదకాలువ నిర్మించిన కొన్నేండ్ల తర్వాత పునరుజ్జీవ పథకం ద్వారా వర్షాభావ పరిస్థితుల్లో కూడా నిండుకుండలా ఉండడం మాకు ఎంతో సంతోషాన్నిచ్చింది. వరదకాలువలో నీళ్లను ఆపుకునేందుకు గట్లు కట్టుకునే పరిస్థితులను కూడా చూసినం.

**-ప్రభుదాస్, రైతు, తిమ్మాపూర్**

### రైతులకు ఎంతో ప్రయోజనం



కాళేశ్వరం నీటిని వరద కాలువ ద్వారా ఎదురురెక్కించడంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరింది. పంటలు ఎండిపోతాయనుకున్న సమయంలో కాళేశ్వరం జలాలు రావడంతో బతికించుకున్నాం. ప్రాజెక్ట్ ఉన్నా ప్రయోజనం ఏమిటన్న పరిస్థితి నుంచి రెండు పంటలకు భరోసా కల్పించే స్థాయికి చేర్చింది పునరుజ్జీవ పథకం. ఈ పథకానికి రూపం ఇచ్చిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

**- చిన్నరాజేశ్వర్, రైతు, మోర్తాడ్**





కాళేశ్వరం జలాలు వరద కాలువలో వస్తుండగా పూలతో స్వాగతం పలుకుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల (ఫైల్)

# టీచర్లు లేకుండా స్కూల్ నిర్వహణ



విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌భాస్కర్

- స్వచ్ఛంద సంస్థల పేరిట దివ్యాంగ పిల్లల స్కూళ్ల ఏర్పాటు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అస్తవ్యస్తంగా నిర్వహణ
- 'గాడ్స్' మూగ, చెవిటి పిల్లల స్కూల్‌ను తనిఖీ చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ్ భాస్కర్
- టీచర్లు లేకుండా స్కూల్ నడపడంతో నిర్వాహకులపై ఆగ్రహం

వినాయక్‌నగర్, జూన్ 20: మొన్న స్వధార్.. నేడు గాడ్స్. స్వచ్ఛంద సంస్థల పేరిట దివ్యాంగ పిల్లల స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహకారంతో కొనసాగుతున్న ఈ పాఠశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ తనిఖీల్లో వీటి బాగోతాలు వెలుగుచూస్తున్నాయి. తాజాగా జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ బ్యాంక్ కాలనీలో ఉన్న గాడ్స్ అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న మూగ, చెవిటి పిల్లల స్కూల్‌ను జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావు శుక్రవారం ఆకస్మికగా తనిఖీ చేశారు. 58 విద్యార్థులకు 28 మంది విద్యార్థులే ఉన్నారు. విద్యార్థులను బ్లాక్ బోర్డు పై తెలుగులో అక్షరాలు రాయాలని సూచించగా, సరిగా రాయకపోవడం, విద్యా బోధన చేసే ఉపాధ్యాయులు లేకపోవడం, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందుబాటులో కనిపించకపోవడాన్ని గమనించారు.దీంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'గాడ్స్' నిర్వాహకురాలు శోభను అడి గి వివరాలు తెలుసుకున్నారు. నాలుగు నుంచి పదో తరగతి వరకు ఉన్నా మౌలిక వసతులు కల్పించకపోతే ఎలా అని ప్రశ్నించారు. మూగ, చెవిటి బాలల భవిష్యత్తు విద్యతో ముడిపడి ఉన్నందున, విద్యాబోధనలో నిర్లక్ష్యం తగదని నిర్వాహకులకు సూచించారు. ఈ స్కూళ్ల నిర్వహణపై వివరాలను కలెక్టర్, డీఈవోకు న్యాయ సేవా సంస్థ ద్వారా తెలియజేస్తామని పేర్కొన్నారు.



# ఆరోగ్యమే మహా 'యోగ'ం

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

యోగా సాధనతో
దీర్ఘ కాలిక వ్యాధులు దూరం
రోజురోజుకూ ప్రజల్లో
పెరుగుతున్న ఆదరణ
ఉమ్మడి జిల్లాలో
విరివిగా శిక్షణ కేంద్రాలు

*నేటి ఆధునిక యుగంలో మనిషి యంత్రంలా మారాడు. పోటీ ప్రపంచంలో తీరిక ఉండడం లేదు. ఉరుకుల పరుగుల జీవితంలో ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. ఆహారపు అలవాట్లలో మార్పుచోటుచేసుకోగా.. శారీరక శ్రమ పూర్తిగా తగ్గిపోయింది. టెక్నాలజీ ఎన్నో సౌకర్యాలు, సుఖాలను తెచ్చిపెట్టడంతోపాటు అంతకు మించిన స్థాయిలో చికాకు, కోపం, అసహనం వంటివి అందించింది. ఇందుకోసం రకరకాల మందులను వినియోగిస్తున్నా కొంత వరకు మాత్రమే ఉపశమనం పొందుతున్నాడు. శాశ్వాత పరిష్కారం లభించడం లేదు. వీటి నుంచి బయటపడేందుకు ఎంతో మంది యోగాపై ఆసక్తి పెంచుకుంటున్నారు. యోగా సాధనతో మానసిక, శారీరక సమస్యలను పూర్తిగా అధిగమించవచ్చుననే భావన ప్రతి ఒక్కరిలో వ్యక్తమవుతున్నది.*

*-కామారెడ్డి/ సుభాష్‌నగర్, జూన్ 20*



**శారీరక** రుగ్మలతోపాటు మానసిక సమస్యలకు చక్కని పరిష్కారానికి యోగా మార్గం చూపుతున్నది. దీంతో యోగా సాధకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించడానికి యోగా సాధనంగా ఉపయోగపడుతున్నది. ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న పరమ ఔషధం యోగా. ఇప్పుడు యోగా కేంద్రాలు వీధివీధిలో వెలిశాయి. శిక్షకుల సంఖ్య సైతం పెరిగింది. యోగా విశిష్టతను తెలియజేస్తూ ప్రతి సంవత్సరం జూన్ 21న దేశ వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పలు యోగా కేంద్రాల్లో యోగా విశిష్టతపై అవగాహన కల్పిస్తున్నారు.

**యోగాకు పెరుగుతున్న ఆదరణ**

కామారెడ్డిలో 1994లో గరిపల్లి ఆంజనేయులు 15 మందితో యోగా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో వందల మంది ఉచితంగా శిక్షణ పొందుతున్నారు. జిల్లా కేంద్రంలోని పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్, ఆయుష్ యోగా కేంద్రాల ద్వారా కూడా శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ప్రతి రోజు ఉదయం 5 నుంచి జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలోని పతంజలి యోగా కేంద్రంలో, రాంమందిర్ లో యోగాలో శిక్షణ ఇస్తున్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు రాంచంద్రం సీనియర్ సిటిజన్లకు ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నారు.



### ప్రతిరోజూ యోగా నేర్పిస్తున్నాం..

కామారెడ్డి జిల్లా కేంద్రంలో మూడు యోగా కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రతిరోజూ ఉదయం 5 నుంచి 6 గంటల వరకు యోగా నేర్పిస్తున్నాం. 24 ఏండ్ల నుంచి యోగా తరగతులు నిర్వహిస్తున్నాం.యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుంది.

**-గద్దం రాంరెడ్డి, యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు**

### ఆరోగ్యమే మహాభాగ్యం



20 ఏండ్ల నుంచి యోగా చార్యులుగా ఎంతో మందికి శిక్షణ ఇస్తున్న. అనారోగ్య కారణాలతో అనేక మంది యోగాపై ఆసక్తి చూపి నేర్చుకుంటున్నారు. మందులు అవసరం లేకుండానే యోగా సాధనతో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతున్నాయి.

**-రమ, యోగాచార్యురాలు**

### 1983 నుంచి శిక్షణ ఇస్తున్నా..



1983 నుంచి యోగా శిక్షణ ఇవ్వడం మొదలు పెట్టారు. 1986లో యోగా అసోసియేషన్ ఏర్పాటు చేశాను. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో దయానంద్ యోగా కేంద్రాన్ని నెలకొల్పి ఉదయం, సాయంత్రం అనేక మందికి యోగాలో శిక్షణ ఇస్తున్నాను. యోగాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో యోగాను ఒక భాగంగా అలవర్చుకోవాలి.


**-రాంచంద్రం, ప్రముఖ యోగాచార్యులు**

# వానాకాలం మెట్ట సాగుకు దిగులొద్దు

విత్తన విభాగం హెడ్ డాక్టర్ నగేశ్



మక్కజొన్న



కంది

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 20: రాష్ట్రంలో వానాకాలం సాగుకు వాతావరణం అనుకూలంగా ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షం పడలేదని రెండు ఆపైగా వర్షాలు కురిసిన చోట మెట్ట పంటలు సాగు చేసుకోవచ్చని, దిగులు చెందాల్సిన అవసరం లేదని, వచ్చే నెల మొదటి వారం వరకు సాగు చేసుకోవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన విత్తన విభాగం హెడ్ సీనియర్ శాస్త్రవేత్త జి నగేశ్ అన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పడకపోవడంతో రైతులు దిగులు చెందాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే నెల మొదటి వారం వరకు మెట్ట పంటలు సాగు చేసుకోవచ్చని సూచించారు .విత్తన ఎంపిక, పొలం చదును చేయడం, నేలను వీలైనంతవరకు లోతుగా దున్నడం వంటి పనులు పూర్తిచేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. మెట్ట పంటలో ప్రధానంగా పత్తి కి బదులుగా మక్కజొన్న, జొన్న ,ఆముదము, వేరుసెనగ ,కంది తదితర పంటలను సాగు చేసి అధిక దిగుబడులు, మంచి లాభాలు ఆర్జించవచ్చని సూచించారు. మేలైన రకాలను ఎంపిక చేసుకొని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులను సంప్రదించి సాగు చేయాలన్నారు. వీలైనంతవరకు గుర్తింపు ఉన్న విత్తనాలు, సేంద్రియ ఎరువులను వాడాలని ఆయన సూచించారు. తప్పని పరిస్థితుల్లో మాత్రమే రసాయన ఎరువులు వాడాలని తెలిపారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పంటలకు అధిక డిమాండ్ ఉంటుందని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన నాణ్యత గల విత్తనాలను, ప్రధానంగా మక్కజొన్నలో డీహెచ్ఎం 117, డీహెచ్ఎం 121, కరీంనగర్ మక్కా -1, కరీంనగర్ మక్కా తో పాటు గుర్తించబడిన వాటిని ఎంపిక చేసుకోవాలని సూచించారు. కందిలో డబ్ల్యూ ఆర్ జీ ఈ 97 ,(వరంగల్ కంది 1) డబ్ల్యూ ఆర్ జీ ఈ- 93 (తెలంగాణ కంది ), డబ్ల్యూ ఆర్ జీ ఈ 121 (తెలంగాణ కంది 2) టీడీఆర్‌జీ 4,( హనుమ) డబ్ల్యూ ఆర్‌జీ 65,( రుద్రేశ్వర) పీఆర్‌జీ 176, ఉజ్వల ఐసీపీ హెచ్ 27 40 (మన్నెంకొండ కంది), టీడీఆర్‌జీ 272 (తెలంగాణ కంది 4) ,డబ్ల్యూ ఆర్‌జీఈ 255, టీడీఆర్‌జీ 59 వంటి రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. మన నేలల్లో 19-19-19 ఫర్టిలైజర్ వాడకం మంచి ఫలితాలను ఇస్తుందని తెలిపారు.

# మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా!

ఏడు చెప్పు దెబ్బలు..దొంగతనంగా కొనుగోలు చేసి తాగినా అదే శిక్ష



గుండారంలో సమావేశమైన గ్రామస్తులు

- పట్టించిన వారికి రూ.20 వేల నగదు బహుమతి
- గుండారం, ఎల్లాపూర్ తండా, నడిమితండా గ్రామస్తుల తీర్మానం
- మద్యపాన నిషేధంలో ఆదర్శంగా నిలుస్తున్న గ్రామాలు

రాజంపేట్, జూన్ 20: మద్యపాన నిషేధంలో మండలంలోని పలు గ్రామాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఇప్పటికే మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని కొండాపూర్, గుడి తండా, షేర్ శంకర్ తండా గ్రామస్తులు ఇటీవల మద్యపానం నిషేధించారు. ఈ గ్రామాలను ఆదర్శంగా తీసుకున్న గుండారం గ్రామ పరిధిలోని గుండారం, ఎల్లాపూర్ తండా, నడిమితండా గ్రామాలు తాజాగా మద్యపాన నిషేధం విధించాయి. ఈ మేరకు గ్రామస్తులు శుక్రవారం గుండారం ఎల్లమ్మ గుడి వద్ద సమావేశమై మద్యపానం నిషేధిస్తూ తీర్మానం చేసుకున్నారు. గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే లక్ష రూపాయల జరిమానాతోపాటు ఏడు చెప్పు దెబ్బలు విధించనున్నట్లు తీర్మానించారు. మద్యం విక్రయించే వారిని పట్టించిన వారికి రూ. 20వేల నగదు బహుమతి అందిస్తామని, దొంగతనంగా మద్యం కొని తాగితే ఏడు చెప్పు దెబ్బలు ఉంటాయని తీర్మానంలో పేర్కొన్నారు. గ్రామాల్లో యువత మద్యానికి బానిసై ప్రమాదాలకు గురవుతున్నారని, అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మద్యపాన నిషేధం అమలుతీరును పర్యవేక్షించేందుకు గ్రామానికి ఇద్దరి చొప్పున తీసుకొని కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

